

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## గ్రామాల వరకూ రెవెన్యూ సేవలు..

- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా రెవెన్యూ సదస్సులు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

**కల్వకుర్తి, జూన్ 5 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం లోని పంజుగుల గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును గురువారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను స్వయంగా సందర్శించి, అక్కడ వచ్చిన ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అర్జీదారులతో ముఖాముఖిగా చర్చలు జరిపిన కలెక్టర్, వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను సవివరంగా తెలుసుకొని, తక్షణమే పరిష్కరించాల్సి నఅంశాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సులో ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో, అవి ఆన్‌లైన్‌లో నమోదు అవుతున్నాయా?, అనే అంశాలపై అధికారులను ప్రశ్నించారు. దరఖాస్తుల నమోదు ప్రక్రియలో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రసీదులు ఇవ్వాలని, సంబంధిత రిజిస్టర్లలో స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సదస్సుల హెల్ప్ డెస్క్ లను, నమోదు పత్రాలను, విభజన విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, సమస్యల ప్రకారంగా దరఖాస్తులను వర్గీకరించి, పక్కాగా రికార్డులు తయారుచేయాలని సూచించారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని చెప్పారు. జూన్ 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. భూములపై సమస్యలు ఉన్న ప్రజలు ఈ సదస్సులను వినియోగించుకొని, తమ అర్జీలను సమర్పించాలని ఆయన సూచించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూసే ప్రజలందరూ హాజరై, భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు, ఏదైనా సమస్య పరిష్కారానికి నిబంధనలు అనుమతించని పక్షంలో, దాని కారణాన్ని దరఖాస్తుదారుడికి స్పష్టంగా అర్థమయ్యేలా వివరించాలని కలెక్టర్ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూసుకోవాలని ఆదేశించారు రెవెన్యూ సదస్సుల అనంతరం క్షేత్రస్థాయిలో విచారణ అవసరం ఉండే సమస్యలపైనా నిశితంగా దృష్టి పెట్టాలని, వివరాల నమోదు సరిగ్గా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన వారికి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలన్నారు. కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

## వరి కొనుగోలుపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 5 ప్రభాతవార్త:** వరి కొనుగోలుపై అదనపు కలెక్టర్ పిఅమరేందర్‌తో కలిసి పౌరసరఫరాలు, డిఎం సివిల్ సప్లై, డిఆర్డిఏ అధికారులతో సమీక్ష సమావేశాన్ని గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నిర్వహించారు. సమీక్ష సమావేశంలో జిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలులో జాప్యం లేకుండా లారీల ఏర్పాట్లు, హమాలీలు,రైస్ మిల్లు వద్ద ధాన్యం కలిచేయడం వంటి పలు అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చ నిర్వహించారు. జిల్లాలో ఎక్కడేనా కొనుగోలు కేంద్రాల పరిధిలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో అక్కడక్కడ కురుస్తున్న అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రైతుల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాల్లోని రైతుల నుండి చివరి దశలో ఉన్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని 25 వేల 453 మంది రైతులతో నేటి వరకు 1,48,407 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు 314.65 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని, ఇంకా 25 కోట్ల రూపాయిలు రైతుల ఖాతాల్లో జమ కావలసి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహారావు, డిఎం సివిల్ సప్లై రాజేందర్, జిల్లా కోపరేటివ్ అధికారి, డిఆర్డిఏ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన ప్రారంభించాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, జూన్ 5 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణం నుండి వెళ్లే పాన్గల్ పెబ్బేర్ రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మున్సిపల్‌అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్లో రోడ్డు విస్తరణ పనులపై సమీక్ష నిర్వహించారు. పానగల్ రోడ్డుకు సంబంధించి మొత్తము ఎంత మంది స్థలాలు కోల్పోతున్నారు. వారికి ఇప్పటి వరకు అందజేసిన సహకారంపై కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. పానగల్ రోడ్డు విస్తరణకు సంబంధించి 63 మంది స్థలాలు కొంత వరకు కోల్పోతున్నారని అందులో ఇప్పటికే 22 మందికి రెండు పడకల ఇళ్లు కేటాయించినట్లు మున్సిపల్ కమిషనర్ వివరించారు. కొత్తగా మరో18 మంది డబుల్ బెడ్ రూమ్ అడుగుచున్నారని, 24 మంది ప్లాట్ అడుగుచున్నట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇందులో 8 మందికి పూర్తిగా స్థలం కోల్పోతున్న వారు ఉన్నట్లు తెలిపారు. స్పందించిన కలెక్టర్ కొంతమందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు, లేదా ఇందిరమ్మఇళ్లు కేటాయిస్తామని, మిగిలిన వారికి టిడిఆర్ బాండ్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. పెబ్బేరు రోడ్డు పై మాట్లాడుతూ 80 ఫీట్ల రోడ్డుకు కొలతలు తీసుకోవాలని,స్థలం కోల్పోతున్న వారికి టిడిఆర్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండవ దఫా నోటీసులు జారి చేసి పనులు త్వరగా ప్రారంభించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్‌లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య మున్సి పల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎఈ పావని ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇథనాల్ ఘటనపై కేసు నమోదు

- 12 మందిని రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్సై జగదీష్

**మానవపాడు, జూన్ 5 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడలో జరుగుతున్న ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా క్యాంపు అక్కడ పనిచేస్తున్న సిబ్బంది మీద దాడికి పాల్పడడమే గాక కొన్ని వస్తువులను ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదయింది. ఈ మేరకు గురువారం ఎస్ఐ జగదీష్ వివరాలు వెల్లడించారు. ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ గ్రామస్తులు సహనం కోల్పోయి క్యాంపు పైకి పెట్రోలు, కట్టెలు కారంపొడితో వచ్చి ధ్వంసం చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది మీద దాడి చేస్తుండగా పోలీస్ సిబ్బంది వారిని అదుపు చేస్తున్న క్రమంలో వారిపైన కూడా ఆందోళన కారులు రాళ్లు రువ్వినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనలో 40 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారిలో 12 మందికి రిమాండ్ విధించి మరో ఐదుగురికి నోటీసులు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా వీడియోగ్రఫీని క్షుణ్ణంగా పరిశీలించి దాడిలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని ప్రజలకు సూచించారు. పరారీలో ఉన్న వారిని గుర్తించి ఉన్నత అధికారుల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

# నేడు జిల్లాకు ఉప ముఖ్యమంత్రి

- మూసా పేట, నవాబ్ పేటలో పర్యటన
- విద్యుత్ సబ్ స్టేషన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన
- డిప్యూటీ సీఎం భట్టి పర్యాటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ విజయేంద్ర బోయి



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్5, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లో జిల్లాలో శుక్రవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. మూసాపేట, నవాబ్ పేట మండలం లలో విద్యుత్ సబ్ స్టేషన్ ల నిర్మాణానికి శంకు స్థాపనచేసి అనంతరం పబ్లిక్ మీటింగ్ కార్యక్రమాల్లో పాల్గొన నున్నారు. ఈమేరకు గురువారం మూసా పేట మండలం లో జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి పర్యటించి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శుక్రవారం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.

-మిగతా4లో..

# ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. కాలుష్యాన్ని అంతం చేద్దాం

- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరివేత
- పాల్గొన్న డీఎఫ్‌వో, అదనపు కలెక్టర్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్5, ప్రభాతవార్త:** పర్యావరణం, మానవాళి మనుగడకు హాని కలిగించే ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దామని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకం నిర్మూలించి పర్యావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని ఆమె అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మయూరి పార్క్ వద్ద రహదారి వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించే డ్రైవ్‌లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,జిల్లా అధికారులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్,అధికారులు,విద్యార్థులు మయూరి ఎకో పార్క్ వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరివేసే కార్యక్రమంలో పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలు ట్రాక్టర్‌లో వేయడం జరిగిందిఈ సందర్భంగా మయూరి ఎకో పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణం దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం ప్లాస్టిక్‌ను జయిద్దాం అనేథీమ్‌తో ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయన్నారు. ఇది నేల యొక్క సారవంతతను తగ్గిస్తుంది, నీటి వనరులను కలుషితం చేస్తుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ కణాలుమన ఆహారంలో మరియు నీటిలో చేరి మానవ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని,ఇది క్యాన్సర్, హార్మోన్ల అసమతుల్యత ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీ స్తుందని అన్నారు.ఆహార భద్ర తకు ముప్పు ప్లాస్టిక్ కాలుష్యం ఆహార వనరులను కలుషితం చేయడమే కాక ఆహార భద్రతకు ముప్పు కలిగి స్తుందన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణ వ్యవస్థల సామర్థ్యాన్ని తగ్గిస్తుందని అన్నారు. ప్లాస్టిక్ వాడకానన్ని ప్లాస్టిక్ సంచులు, బాటిళ్ళు, ఇతరప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు ఒకసారి ఉపయోగించి పారవేసే తక్కువ మందం గలసింగల్ యూస్ ప్లాస్టిక్‌ను నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాతయని ప్రజలు భాగస్వాములై ప్రభుత్వానికి సహకరించనాడే లక్ష్యాన్ని సాధిస్తామని అన్నారు.అనంతరం విద్యార్థులకు



చెత్తను ఏరేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

-మిగతా4లో..

## రహదారి భద్రతా చర్యలు

- రహదారులపై బ్లాక్ స్పాట్ లు గుర్తింపు
- ఎన్.హెచ్ 167, 44పై రంబుల్ స్ట్రిప్‌లు, సైన్ బోర్డ్‌లు ఏర్పాటుకు ఆదేశం
- 447 ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్‌లకు అనుమతి రద్దు
- సమీక్షించిన కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్5, ప్రభాతవార్త:** జిల్లాలో రహదారులపై ప్రమాదాల నివారణకు వివిధ శాఖలు సమన్వయంతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్.పి. జానకి ధరావత్‌తో కలిసి పోలీస్,రవాణా,జాతీయ రహదారులు,వైద్య ఆరోగ్య శాఖ,అర్‌బి శాఖల అధికారులతో జిల్లాలో రహదారి ప్రమాచాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు జిల్లా టాస్క్ పోర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు జిల్లాలో ప్రమాదాలు జరిగే రాష్ట్ర,జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర రహదారులు,నేషనల్ హైవే 167,44 లపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లు గుర్తించి సంబంధిత శాఖల తగిన చర్యలు

-మిగతా4లో..

## పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

- మనిషి మనగడకు చెట్లు నాటాలి : వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



మొక్కలు నాటుతున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్, జూన్ 5 ప్రభాతవార్త:** మన చుట్టూ ఉండే పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం రోజు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆటవీశాఖ ఆధ్వర్యంలో ఎకో పార్క్ దగ్గర ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని వనపర్తి అదనపు కలెక్టర్ యాదయ్య తో కలిసి జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.అనంతరం వనపర్తి పట్టణంలోని ఏకో పార్క్ పరిసర ప్రాంతాలను శ్రమదానం శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. అధునా తన విజ్ఞానం విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో మనిషి తన ముగడకు కావలసిన చాలా వాటిని యంత్రాల సహాయం ద్వారా అందిపుచ్చుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో కర్మాగారాలు ఫ్యాక్టరీలు వాహనాల వల్ల కొంత కాలుష్యం ఏర్పడటం సహజం. కానీ వాటిని అధిగమించే ప్రత్యా మ్నాయమార్గాలు ఎన్నో ఉన్నాయి.అందులో ప్రధానంగా మొక్కలు నాటడం పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవడం శాస్త్రవేత్తల సూచనలు పాటించడం మన కనీస బాధ్యత గుర్తుంచుకోవాలని వివరించారు. వనిఅంటే నీరు అని నీరు సమృద్ధిగా ఉండటం వల్ల వనపర్తికి ఆ పేరు వచ్చి ఉంటుందని తెలిపారు. అనం తరం. జిల్లా అదనపు కలెక్టర్ యాదయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఇంటి పరిసర ప్రాంతా లలో కనీసం మూడు మొక్క లనైనా నాటి పెంచి పెద్ద చేయాలని సూచించారు.ప్రభుత్వ సేవకులపై ఎల్లప్పుడూ ఆధార పడకుండా తమ వీధులనుతాము శుభ్ర పరుచుకునే శ్రమదానం నెలలో ఒక్కసారైనా చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు. జిల్లా అటవీ శాఖ అధికారి నిఖిల్‌రెడ్డి మాట్లాడుతూ.. మన జిల్లా సస్యశ్యామలంగా ఉండాలంటే ప్రధా నంగా నీటి వనరులకోసం భూగర్భ జలాలను పెంచుకోవాలని అన్నారు.అందుకు చెట్లను పెంచడమే అసలైన మార్గమని పేర్కొన్నారు.ప్రతి ఇంటికి ఇంకుడుగుంటలు ఉండాలని అన్నారు.అనంతరం అధికారులు,ఉద్యోగులు సామాజిక కార్యకర్తలు మున్నగువారు పర్యా వరణ అవగాహన ర్యాలీ ఏకో పార్క్ నుండి మర్రికుంట వరకునిర్వహించారు.ఈ కార్య క్రమంలో వనపర్తి అదనపుకలెక్టర్, యాదయ్య, వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు, మున్సి పల్ కమిషనర్, వెంకటేశ్వర్లు, అటవీ శాఖ ఫారెస్ట్ రేంజ్ అధికారి, నిఖిల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సిఐ, నరేష్,వనపర్తి సీఐ, కృష్ణయ్య రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, శ్రీనివాస్, అప్పల నాయుడు, నిస్వార్థ ఆర్గనైజేషన్ సభ్యులు, స్నేక్ సొసైటీ సభ్యులు, అటవీ శాఖ అధికా రులు,సిబ్బంది, పోలీస్ అధికారులు, సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 20ఏండ్లపాటు కరెంట్ కష్టాలుండవు

- నేడు 6 సబ్ స్టేషన్లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన
- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి వెల్లడి



బాలానగర్ మండలం నేరెళ్లపల్లిలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి (ఫైల్)

**జడ్చర్ల, జూన్5,ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గానికి 21 కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్లు, మరో 132/33 కేవీ సబ్ స్టేషన్ ను కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ఈ సబ్ స్టేషన్ల నిర్మాణాలతో మరో ఇరవై ఏళ్ల పాటు జడ్చర్ల నియోజకవర్గంలో విద్యుత్ కష్టాలు ఉండవని పేర్కొన్నారు.స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి మొదలుకొని 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగేవరకూ కూడా జడ్చర్ల నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 35సబ్ స్టేషన్లు ఉండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే రూ.66.50 కోట్లతో 21 కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్లను మంజూరు చేయడం జరిగిందని గురువారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి తెలిపారు. 21 కొత్త సబ్ స్టేషన్లలో ఐదు సబ్ స్టేషన్లకు గతంలో తాను శంకుస్థాపన చేయగా వాటికి సంబంధించిన నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం నవాబుపేట మండలంలోని రుద్రారం, కొండాపూర్, చౌదూర్, జడ్చర్ల మండలంలోని నస్రుల్లాబాద్, గొల్లపల్లి, ఆలూరు, పెద్దపల్లి, నక్కలబండ తాండ జడ్చర్ల పట్టణంలోని గంగాపురం రోడ్డు, క్లబ్ రోడ్డు, మిడ్జిల్ మండలంలోని రాణిపేట్, మున్ననూరు, సింగందొడ్డి, బాలానగర్ మండలంలోని చిన్నరేవల్లి, రాజాపూర్ మండలంలోని కల్లేపల్లి, ఊర్కొండ మండలంలోని ఉర్కొండపేటలో మంజూరైన 16 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ 16 కొత్త 33కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణంతోపాటుగా నవాబుపేటలో రూ.42 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న 132 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి కూడా శుక్రవారం భట్టి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఇప్పటి వరకూ జడ్చర్ల నియోజకవర్గంలో మొత్తం మూడు 132 కేవీ సబ్ స్టేషన్లు ఉండగా వాటిలో పోలేపల్లిలో ఉన్న 132 కేవీ సబ్ స్టేషన్ పూర్తిగా సెజ్ లోని ఫార్మాకంపెనీలకోసమే ఉపయోగించబడు తోందన్నారు. నవాబుపేటలో నిర్మించనున్న 132కేవీ సబ్ స్టేషన్‌తో నవాబుపేటతో పాటుగా రాజాపూర్, బాలానగర్ మండలాల్లోనూ విద్యుత్ సరఫరా మెరుగవుతుందని వెల్లడించారు. ఈ విధంగా రూ.100 కోట్లకు పైబడి నిధులతో రూపు దిద్దుకోనున్న 17 సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఒకేసారి ఒకేచోట శంకుస్థాపన చేయడం చారిత్రాత్మకమని అనిరుధ్ రెడ్డి వివరించారు. కాగా కొత్తగా మంజూరైన 21 సబ్ స్టేషన్లు, ఒక 132 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణంతో మరో ఇరవై ఏళ్లపాటు జడ్చర్ల విద్యుత్ అవసరాలు తీరిపోతాయని అభిప్రాయపడ్డారు. 37 వేల కుటుంబాలకు గృహజ్యోతి:కాగా జడ్చర్ల నియోజకవర్గంలోని 37,557 పేద కుటుంబాలకు గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయడం జరిగిందని, దీని కోసం ప్రభుత్వం రూ.12.06 కోట్లను కేటాయించిందని అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు. అలాగే 3137 వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం రూ.19.45 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.6.26 కోట్లతో 951 ట్రాన్స్ఫార్మర్లను స్ట్రెంతనింగ్ చేయడం జరిగిందని చెప్పారు. విద్యుత్ సరఫరాను మెరుగుపర్చడంలో భాగంగానే రూ.12.29 కోట్లతో 8 పవర్ ట్రాన్స్ఫార్మర్లను 33 కేవీ సబ్ స్టేషన్లలో ఏర్పాటు చేయడం జరిగిందని, రూ.5.27 కోట్లతో 33 కేవీ, 11కేవీ ఎల్టీ లైన్లను మెరుగుపర్చడం జరిగిందని తెలిపారు. ఈ విధంగా తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే జడ్చర్ల నియోజకవర్గంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం మొత్తం రూ.166.97 కోట్లను కేటాయించడం జరిగిందని వివరించారు. జడ్చర్ల ప్రాంతంలోని విద్యుత్ సమస్యలు తీర్చడానికి అడిగిన వెంటనే తమకు సబ్ స్టేషన్లను మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అనిరుధ్ రెడ్డి కృతజతలు తెలిపారు.

## కల్వకుర్తి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, జూన్ 5 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలోని పలు వార్డుల్లో గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రూ.1 కోటి 50 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మున్సిపాలిటిలోని భగత్ సింగ్ తండాలో రూ.15 లక్షల వ్యయంతో మురుగు కాలువ, కేశవనగర్‌లో రూ.25 లక్షలతో సైడ్ డ్రైనేజీ, రాఘవేంద్ర కాలనీలో రూ.22 లక్షలతో సీసీరోడ్ పనులు, బాల్‌రాంనగర్‌లో సీసీ రోడ్, 8వ వార్డు సుభాష్‌నగర్‌లో రూ. 25లక్షలతో సీసీ రోడ్, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ.10 లక్షలు ఓపెన్ జిమ్, ఎమ్మెల్యే క్యాపు కార్యాలయం వద్ద వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద కల్వకుర్తి మున్సిపాలిటీ మెప్మా ఆధ్వర్యంలో చేతివృత్తుల ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి మున్సిపాలిటిలోని అన్ని వార్డుల్లో మోళిక సదుపాయాల కల్పన కోసం పెద్ద పీట వేయడం జరుగుతుంది అని అన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటిలోని అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్ కుమార్, సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ల సంజీవ్ కుమార్ యాదవ్, కల్వకుర్తి మున్సిపల్ కమీషనర్ మహ్మద్ షేక్, మాజీ కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పుస్తకాల రాహుల్, చంద్రకాంత్ రెడ్డి, పాండురంగరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళా సంఘం సభ్యులు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోవుల అక్రమ తరలింపు నిషేధం

- కల్వకుర్తి పోలీస్ సీఐ నాగార్జున

**కల్వకుర్తి, జూన్ 5 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ, కల్వకుర్తి డి.ఎస్.పి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు స్థానిక సీఐ నాగార్జున అధ్యక్షతన కల్వకుర్తిలో ఆవులు, గేదెలు కొనే వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కి పిలిపించి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ నాగార్జున మాట్లాడుతూ బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని గోవధ నిషేధం, అలాగే గోమాత అక్రమ తరలింపు నిషేధం ఉందని ఎవరైనా అతిక్రమిస్తే అట్టి వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, వంగూరు ఎస్సై మహేందర్, చారగొండ ఎస్సై శంషుద్దీన్, చారకొండ వెటర్నరీ డాక్టర్ విజయకుమార్,కల్వకుర్తి సెకండ్ ఎస్సై జి.రామ్ చందర్, వెల్దండ ఎస్సై కురుమూర్తి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగార్జున

# ధాన్యం నిల్వలపై జిల్లా కలెక్టర్ ఆరా..

- మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయండి
- వర్షాలకు ముందే ధాన్యం దిగుమతి పూర్తి చేయాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**కల్వకుర్తి, జూన్5 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ సద్గురు రాఘవేంద్ర పారాబైల్డ్ రైస్ మిల్‌ను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లుకు రోజుకు ఎంత ధాన్యం చేరుతుందని,రోజు ఎంత మొత్తంలో వచ్చిన వరి ధాన్యాన్ని బియ్యంగా మారుస్తూన్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మిల్లులో ఉన్న బియ్యం నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. పెండింగ్ ఉన్న సీఎంఆర్ రైస్‌ను పెండింగ్ లేకుండా ఎఫ్‌సిఐకి తరలించాలని యాజమాన్యానికి కలెక్టర్ ఆదేశించారు. మిల్లకు కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల ధాన్యం పంపించారు, వాటిని దిగుమతి చేసుకున్నారా, ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిపారు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎలా భద్రపరుస్తున్నారు, తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. మిల్లులో ఏమైనా తరుగు తీస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. ముందస్తుగానే రుతు పవనాల ప్రవేశంతో వర్షాలు కురుస్తున్నందున ధాన్యాన్ని వెంటదివెంట దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ధాన్యం నిల్వలను సకాలంలో దించుకోకపోతే వర్షాల వల్ల తడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఇప్పటికే 90 శాతానికి పైగా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తయ్యిందని, చివరి దశలో మిగిలిన ధాన్యం నిల్వలను కూడా సకాలంలో దిగుమతి చేసుకుని సామర్థం మేరకు పూర్తి స్థాయిలో మిల్లింగ్ ప్రక్రియను చేయాలని కలెక్టర్ ఆదేశించారు.మిల్లింగ్ చేసిన బియ్యాన్ని జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునే విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, కల్వకుర్తి తహసిల్దార్ ఇబ్రహీం, మిల్లు యజమాని రమేష్ ఉన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

**జడ్చర్ల బీఆర్ఆర్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం**

**జడ్చర్ల, జూన్5, ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్ల వృక్ష శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ బొటానికల్ గార్డెన్ లో మొక్కలు నాటారు. భాగంగా ప్రతి వ్యక్తి నిత్యావసరాల కోసం ప్లాస్టిక్ ను విరివిగా వాడుతున్నాడు. అలా వాడటం వల్ల పర్యావరణం దెబ్బతినడమే కాకుండా మానవాళికి కూడా నష్టం జరుగుతుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.డి నర్మద పేర్కొన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాలంటే కార్యాచరణ ప్రతి ఇంటి నుంచి మొదలవ్వాలన్నారు. తెలంగాణ బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా. బి. సదాశివయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, తిరిగివాడటం, తిరిగి మార్పుచేయడం, చేయడం వల్ల ప్లాస్టిక్ ను మెల్లమెల్లగా పారద్రోలవచ్చని పేర్కొన్నారు. పర్యావరణం బాగుండాలంటే ముఖ్యంగా మొక్కలు నాటడమే ప్రధాన కర్తవ్యం అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు లత, పరిశోధక విద్యార్థులు రమాదేవి, రాహుల్, వాలంటీర్లు రవి, భరత్, పూర్వ విద్యార్థిని అనిత తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్,కో ఆర్డినేటర్

## బొడ్రాళ్ల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే.

**ఆత్మకూర్ జూన్ 5, ప్రభాతవార్త ;** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో గ్రామదేవతల ఆలయాల పునర్నిర్మాణంతో పాటుగా గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టకు, బొడ్రాళ్ళ ఉత్సవాలు గురువారం రోజు శోభాయమానంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో మక్తల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొని వడ్రాళ్ల ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఆలయాల పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్ చొరవతో ఆత్మకూరు పట్టణ బాగు కోసం దేవాలయాల పునర్నిర్మాణం , గ్రామదేవతల ప్రతిష్ట కార్యక్రమాలు చేపట్టడం సంతోషదాయకమన్నారు. పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో కలిసిమెలిసి జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అంతకుముందుగా బొడ్రాళ్ల ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మాజీ మున్సిపల్ చైర్మన్ గాయత్రీ, రవికుమార్, యాదవ్ ,టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ ,రేచింతల సింగిల్ విండో అధ్యక్షులు లక్షీ మ్రకాంత్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు, కోటేశ్వర్, శేఖర్ ,జానకి, రాములు, సోంబాబు ,తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దేవాలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో చిట్టెం రామ్మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

## ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడును సాధించాలి

**వ్యవసాయ శాస్త్రవేత్తల వెల్లడి**

**ఆత్మకూర్ జూన్ 5, ప్రభాతవార్త :** ప్రస్తుత సమాజంలో ఆధునిక పద్ధతులను ఉపయోగించి రైతులు అధిక దిగుబడులను సాధించాలని వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సురేష్ కుమార్, నరేష్ కుమార్ తదితరులు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి భారత వికసిత సంకల్పయాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు ఆత్మకూరు మండలంలోని మేడేపల్లి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై రైతులను ద్వేషించి మాట్లాడుతూ రైతులు ప్రధానంగా రసాయనక ఎరువుల వాడకాన్ని తగ్గించి ఆధునిక పద్ధతులతో జనుము, జీలుగా , పచ్చిరొట్ట వంటి ఎరువుల ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుందని వారు సూచించారు. ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందజేస్తున్నటువంటి వ్యవసాయ విత్తనాలు సబ్సిడీ ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఝాన్సీ పలువు, రైతులు గ్రామానికి చెందిన ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.


మేడేపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

## రైతు వేదికలో కంప్యూటర్ పరికరాలను చోరీ చేసిన దొంగలు పట్టివేత

**ఖిల్లా గణపురం,జూన్ 5, ప్రభాతవార్త;** మండల కేంద్రంలోని రైతు వేదికలో గత నెల 30వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు రైతు వేదికలో ఏర్పాటుచేసిన కంప్యూ టర్లను దొంగిలించారని క్లస్టర్ కు చెందిన కంప్యూటర్ టెక్నీషియన్ మాధవరావుపల్లి సునీత పోలీస్ స్టేషన్లో ఫిర్యా దు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన ఎస్సై సురేష్ గౌడ్ సిబ్బంది గురువారం వెంకటం పల్లి రూ ట్లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఆగారం గ్రా మానికి చెందిన చోరీ చేసిన నిందితులు చిట్యాల మాధవులు 27 సంవత్సరములు, బొక్కెన నాగార్జున 24 సంవత్సరములు, కోతి మన్నెమయ్య 28 సంవత్సరములు వారి సొంత ఆటోలో కంప్యూటర్ పరికరాలు వేసుకొని అమ్మడానికి వెళుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారిని స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసి రిమాండ్ తరలించిన ఎస్సై తెలిపారు. చోరీ అని ఎందుకు నన్ను పట్టుకోవడానికి కృషిచేసిన సిబ్బంది లింగం, బి రాజు చైతన్యకుమార్, మునవర్లను ఎస్పీ గిరిధర్ ప్రత్యేకంగా అభినందించారు.


దొంగిలించిన నిందితులతో పోలీసు సిబ్బంది

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ

**ఉప్పునుంతల, జూన్ 5 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదవారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన పత్రాలను గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి మహేష్ కుమార్ సమక్షంలో లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలో 23 మందికి మంజూరు కావడంతో లబ్ధిదారులకు మంజూరైన ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపిరెడ్డి రఘుపతి రెడ్డి, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపి రెడ్డి రమేష్ రెడ్డి, గోపిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ గుడ్ల నర్వ లక్ష్మయ్య, కొప్పునూరు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

**మానవపాడు, జూన్ 5 ప్రభాతవార్త :** ఉద్యోగ బాధ్యతను క్రమశిక్షణ కలిగి అంకితభావంతో పని చేస్తూ విధులు నిర్వహిస్తే అందరి చేత మన్ననలు పొందుతారని అలంపూర్ సీఐ రవి బాబు అన్నారు. గురువారం ఉండవల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ తెలంగాణ సిఐడి హైదరాబాద్ విభాగానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ రవిబాబు, ఎస్సై మహేష్ తన సిబ్బందితో కలిసి రాజశేఖర్‌ను పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ డిపార్టుమెంట్‌కి మంచి పేరు వచ్చే విధంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్ల రాఘవేంద్రబాబు,రవి, ఖాదర్, హుస్సేన్ పాల్గొన్నారు.


కానిస్టేబుల్ రాజశేఖర్ ను సన్మానిస్తున్న సిఐ, పక్కన ఎస్సై పోలీసు సిబ్బంది

# అమిస్తాపూర్‌లో మున్సిపాలిటీ పర్యావరణ ర్యాలీ

**- భూత్పూర్‌లో 100రోజుల కార్యాచరణ ప్రణాళిక.. - మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవ ప్రతిజ్ఞ**

**భూత్పూర్, జూన్ 5,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతోప్రతిష్టాత్మకంగా తీసుకున్న 100రోజుల కార్యాచరణప్రణాళికను పకడ్బంధీగా అమలుచేస్తున్నారు. ఇందులోభాగంగా ఈ నెల2నుంచి 10వరకు మున్సిపాలిటీపరిధిలో ఘన వ్యర్థపదార్థాల నిర్వహణపై ప్రత్యేకకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డులలో కమిషనర్ నూరుల్ నజీబ్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్,స్వచ్ఛ సర్వేచ్ఛన్ ఇంచార్జి శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రజాప్రతి నిధులు,అధికారులు, ఉద్యోగులు,పారిశుద్ధ్య సిబ్బంది ఆయావార్డులలో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటర్నల్ రోడ్లు,డ్రైనేజీల నిర్మాణాలు,మంచినీటి సరఫరావంటి అంశాలపై దృష్టిని సారిస్తూ పర్యావరణం,కాలుష్య నివారణవంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అమిస్తాపూర్ ఏడోవార్డులో అవగాహనర్యాలీ నిర్వహించారు. అమిస్తాపూర్‌లోనిఆయావార్డు ప్రజలు,ప్రజాప్రతినిధులు,మున్సిపల్ ఉద్యోగులు,పారిశుద్ధ్య సిబ్బంధిచే మున్సిపల్‌కమిషనర్ నూరుల్‌నజీబ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నూరుల్‌నజీబ్ మాట్లాడుతూ వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భూత్పూర్ మున్సిపాలిటీకి ఎమ్మెల్యే జీఎంఆర్‌చొరవతో రు. 3కోట్లనిధులు మంజూరయ్యాయని,ఒక్కొ వార్డుకు రు. 30లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతు న్నట్లు తెలిపారు.


అమిస్తాపూర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పర్యావరణ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్

**భూత్పూర్ మున్సిపాలిటీపై ఎమ్మెల్యే జీఎంఆర్ వరాల జల్లు**

**పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్**

అభివృద్ధి చెందుతున్న భూత్పూర్ నూతన మున్సిపాలిటీపై దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) వరాల జల్లు కురిపించారు. మున్సిపాలిటీలోని పదివార్డులలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే జీఎంఆర్ రు. 3కోట్లు మంజూరు చేయించారని పేర్కొన్నారు. అమిస్తాపూర్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీ, కాలుష్య ప్రతిజ్ఞలో మున్సిపల్ సూపరిన్‌టెండెంట్ నర్సింహులు ఇతర ఉద్యోగులు రాజశేఖర్,ఆర్పీలతో పాటు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పద్మమ్మ నాయకులు మశ్చేందర్,పవన్,రాజేష్, శివరాములు, అఫ్రోజ్ పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిది

**అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ**

**గద్వాల అర్బన్, జూన్ 5,ప్రభాతవార్త:** పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతని,అందుకే విరివిగా మొక్కలునాటి సంర క్షిస్తూ, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో విద్యార్థులుతో కలిసి కృష్ణవేణి చౌరస్తా నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దామనే నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం – 2025ను నిర్వహించడం జరుగుతోందన్నారు. భూమి, నీరు, వాయువుల సంరక్షణతోపాటు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. ఒకేసారి వినియోగించే ప్లాస్టిక్రమని,ప్రజలు దీనిపై అవగాహన కలిగి చర్యలు తీసుకోవాలన్నారు. పాలిథిన్ వ్యర్థాలు భూమిలో కలవకుండా జాగ్రత్త పడితే భావి తరాలకు మేలు చేసినట్లు అవుతుందన్నారు. ఎక్కువ మొక్కలను నాటి, సంరక్షి ంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రకృతిని ప్రేమిస్తూ పర్యావరణాన్ని రక్షించడం వలన ప్రకృతి మన భవిష్యత్తరాలకు మేలు చేస్తుందన్నారు. ప్రతి ఇంటి ముందు మొక్కలను నాటడంతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని,చెట్లను కాపాడుకునేందుకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు అందరూ కంకణబద్ధులై ఉంటామని, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కలను నాటి సంరక్షి స్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, సహాయక పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ విద్యులత ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ రమేష్ బాబు, ఎఫ్.ఆర్.ఓ పర్వేజ్ అహ్మద్, విద్యార్థులు,ఓ తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తూ మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

## విగ్రహ ప్రతిష్ట మహోత్సవములో పాల్గొన్న ఎమ్మెల్యే

**గద్వాల అర్బన్,జూన్ 5,ప్రభాతవార్త:** గద్వాల మండలం పరిధిలోని లత్తిపురం గ్రామంలోని బండల శ్రీ సోమేశ్వర స్వామి, శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవము కార్య క్రమానికి ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవము, ధ్వజస్తంభని ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మె ల్యేకి గ్రామస్తులు,నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనం గా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బడి, గుడి తప్పనిసరిగా ఉండాలన్నారు. దేవాలయాలు ఉండడం వల్ల ప్రజలలో భక్తి భావం పెరిగి, భక్తి శ్రద్ధలతో దేవుని పూజించడం వల్ల శాంతి నెలకొల్ప బడుతుందన్నారు. గ్రామంలో అందరూ కలిసి,మెలిసి ఉం డాలన్నారు. దేవాలయ అభివృద్ధి కోసం ఏవిధంగా పాటుపడుతున్నారో అదేవిధంగా గ్రామ అభివృద్ధికి కూడా ప్రతి ఒక్కరూ కలిసి,మెలిసి ఐక్యతతో ఆదైవ అనుగ్రహంతో గ్రామం అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొన్నదన్నారు. రైతులు అభివృద్ధి చెందాలని, పాడి పరిశ్రమ పరంగా అన్ని రంగాలలో గ్రామం అభివృద్ధి చెందాలన్నారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా స్వామివారిని కోరుకోవడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ జడ్పీ వైస్ చైర్పర్సన్ సరోజమ్మ రమేష్ నాయుడు, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, నాయకులు సత్య రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, రాజా రెడ్డి , నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


బండల సోమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

## భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : తహసీల్దార్ ప్రమీల

**ఉప్పునుంతల, జూన్ 5 ప్రభాతవార్త :** భూ భారతితోనే భూ సమస్యల పరిష్కారమవుతాయని ఉప్పునుంతల తహసీల్దార్ ప్రమీల అన్నారు. గురువారం మండలంలోని కొరటికల్ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి ప్రజల భూములకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను ఆమె స్వయంగా స్వీకరించారు. వీటిని క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి తదుపరి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రజలకు, రైతులకు భూభారతి రెవెన్యూ సదస్సుల పట్ల అవగాహన కల్పించారు. అదేవిధంగా మండలంలోని సదగోడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఉప తహసీల్దార్ పరుష్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొరటికల్ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు రైతులను నుంచి వివిధ సమస్యల పై 36 వరకు దరఖాస్తులు రాగా, సదగోడు రెవెన్యూ సదస్సుల్లో వివిధ రకాల సమస్యల పై 44 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు వివరించారు. తహసీల్దార్ ప్రమీలతో పాటు ఉప తహసీల్దార్ పరుష్ నాయక్, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సుజాత, సీనియర్ అసిస్టెంట్ బాల్ రాం నాయక్, జూనియర్ అసిస్టెంట్ అబ్రహార్, సిబ్బంది రమణమ్మ స్వప్న, శివ, ఆదిత్య, శంకర్, రాజ్ కుమార్, స్థానిక నాయకులు అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపి రెడ్డి రమేష్ రెడ్డి, గోపిరెడ్డి రఘుపతి రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుడ్ల నర్వ లక్ష్మయ్య, జంగయ్య, వెంకటయ్య,రైతులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రమీల

## ప్లాస్టిక్ వాడకం నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందాం

**ఉప్పునుంతల,జూన్5 ప్రభాతవార్త:** ప్లాస్టిక్‌వాడకం నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందాం అని వైద్య అధికారిణి డా. స్వప్న పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆసుపత్రిలో వైద్య సిబ్బందితోపాటు ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఆశా కార్యకర్తలు కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతి పాటించాలని వీటిపై ఆశా కార్యకర్తలు అవగాహనతో పని చేయాలని ఆమె సూచించారు. గ్రామాలలో ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని, అప్పుడే పర్యావరణాన్ని కాపాడుకోవడానికి వీలుంటుందని సూచించారు. గ్రామాల్లో ప్రజలను చైతన్యపరుస్తూ వారి వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. రాబోయే వర్షాకాలం సమయంలో అపరిశుభ్రత ద్వారా వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామాలలో విస్తృతంగా పర్యటించాలని వారికి సూచించారు. ప్రజలు ఇండ్లలో మరుగునీరును నిర్వహించకుండా ఎప్పటికప్పుడు శుభ్ర పరచు కోవాలని, అపరిశుభ్రత ఏర్పడినప్పుడు దోమల బెడద అధికంగా పెరిగి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆమె సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో వైద్యాధికారిణి డా. స్వప్న, సూపర్ వైజర్ ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పి,ఎంఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైద్య అధికారిణి డా. స్వప్న

## ఉప్పరపల్లిలో ధ్వజస్తంభం ప్రతిష్టాపన

**పాల్గొన్న ఎమ్మెల్యే మెగా రెడ్డి**


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మెగా రెడ్డి

**ఖిల్లా గణపురం, జూన్ 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో బుధవారం నుండి చిద్రి నారాయణ స్వామి శివాలయం తో పాటు దత్తాత్రేయ స్వామి ఆలయం ఆవరణలో రెండు రోజులుగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గురువారం ధ్వజస్తంభాన్ని మీద పండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రతిష్టాపన చేశారు. ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సామాజిక సేవతో పాటు భక్తి శ్రద్ధలతో భగవంతుని సేవలో కూడా పాల్గొనడం తనకు ఆనందాన్ని కలిగించిందని ఇలాంటి కార్యక్రమాలు గ్రామస్తులు ఐకమత్యంతో జరుపుకోవాలని సూచించారు.

## బూడిదిపాడులో భూభారతి సదస్సు


దరఖాస్తులను స్వీకరిస్తున్న సిబ్బంది

**మల్దకల్, జూన్ 5, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టాన్ని అమలు చేసేందుకు అధికార యంత్రాంగం గ్రామాల్లో భూభారతి సదస్సులను నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా గురువారం మండల పరిధిలోని బూడిదిపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని భూభారతి సదస్సు నిర్వహిస్తున్నారు. డిప్యూటీ తహసిల్దార్ విమోచన తోపాటు సీనియర్ అసిస్టెంట్ కరీం సిబ్బంది. పాల్గొని రైతుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

## పదోన్నతి ద్వారా పోలీసులకు గుర్తింపుతో పాటు విధులపట్ల ఉత్సాహం

**జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు**

**గద్వాల అర్బన్, జూన్ 5,ప్రభాతవార్త:** ఏఎస్సై నుండీ ఎస్.ఐ గా పదోన్నతి పొందిన అధికారికి అభినందన ఎస్పీ శ్రీనివాస్ రావు అభినందనలు తెలిపారు. జోగుళాంబ గద్వాల్ జిల్లా గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తు ఏఎస్సై నుండి ఎస్.ఐ గా పదోన్నతి పొందిన ఏం.వెంకటేష్ గౌడ్ ను జిల్లా ఎస్పీ ట. శ్రీనివాస రావు అభినందించి వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నాంను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు తో పాటు, విధుల పట్ల మరింత ఉత్సా హం వస్తుందని అన్నారు. పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందన్నారు. పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల మరింత నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా కృషి చెయ్యాలన్నారు.

## శేఖర్ కుటుంబానికి మిత్రుల ఆర్థికసాయం

**భూత్పూర్,జూన్ 5,ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తమ టెన్త్ 1993-94బ్యాచి సహచరుడైన అనుప చంద్రశేఖర్ వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా,మృతుడైన శేఖర్ కుటుంబాన్ని ఇదోచితంగా ఆదుకునేందుకు శేఖర్ టెన్త్ బ్యాచి మిత్రబృందం ముందుకు వచ్చారు. అందరు కలిసి గురువారం రు. 50వేలు ప్రోగు చేసి మృతుడు శేఖర్ భార్య అమృతకు అందజేశారు. 1993-94టెన్త్ శేఖర్ బ్యాచికి చెందిన మంగలి భాస్కర్,గడ్డమీది శంకర్,ఎంకంపల్లి మల్లేష్,మధు,నాగిరెడ్డి తదితరులు ఆర్థిక సహాయం అందజేసినవారిలో ఉన్నారు.

## డీసీఎంఎస్ రైతుసేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే


డిసిఎంఎస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**గద్వాల అర్బన్, జూన్ 5 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం గట్టు మండలం పరిధిలోని ఆరగిద్ద గ్రామంలో డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రం ఫర్టిలైజర్ అండ్ సీడ్స్ ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గురువారం ప్రారంభించా రు. షాప్ యజమాని వెంకటేష్ ఎమ్మెల్యే కి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ వెంకటేష్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, నాయకులు రామకృష్ణ రెడ్డి, చంద్రశేఖర్, రాజప్ప గౌడ్, సంతోష్ హనుమంత్ రెడ్డి, కృష్ణ, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**నారాయణపేట, జూన్ 5 ప్రభాతవార్త:** నారాయణ పేట మండలంలోని ఎక్లస్పూర్ గ్రామంలో రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ శాస్త్రవేత్త డా. జెడి సరిత మాట్లాడుతూ రైతులు వ్యవసాయం లో రసాయనాల వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. వాటి స్థానం లో పచ్చిరొట్ట మరియు వానపముల ఎరువు, జీవన ఎరువులు వాడాలని సూచించారు. పప్పు జాతి పంటలతో పంట మార్పిడి చేయడం ద్వారా అధిక ఆదాయంతో పాటు భూసారం పెంచుకోవచ్చు అని తెలియచేసారు. రైతులు రషీదు లను భద్రప రచుకోవడం ద్వారా కష్ట కాలంలో నష్ట పరిహారం పొందవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో నారాయణపేట ఎంఏఓ బాలదినకర్, ఏవో,బి. రాజేష్, 50 మందికి పైగా రైతులు హాజరయ్యారు.

## జన్మదిన వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల

**భూత్పూర్,జూన్ 5,ప్రభాతవార్త :** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు,మండల రైతు బంధు మాజీ అధ్యక్షుడు మొల్గర నర్సింహులు గౌడ్ మనవడు విశృత్‌గౌడ్ జన్మదిన వేడుకలు గురువారం భూత్పూర్ మండలం కొత్తమొల్గరలోని నర్సింహులుగౌడ్ నివాసంలో ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై చిన్నారి విశృత్‌గౌడ్‌ను ఎత్తుకుని ఆశీర్వదించారు.మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీ భూత్పూర్ మండల అధ్యక్షుడు,మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డిలతో పాటు పార్టీ నాయకులు టి మురళిధర్‌గౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,మేకల సత్యనారాయణ, రాజశేఖర్‌రెడ్డి,పొన్నకల్ మహిమూద్,మొహ్మద్ సాధిక్,నరేష్‌గౌడ్,రాజుగౌడ్,మండడి సరోజ్‌రెడ్డి,ఆల శ్రీకాంత్‌రెడ్డి,శేఖర్‌గౌడ్,ప్రభాకర్,వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొని చిన్నారి ఆశీర్వదించారు.

## ప్రతి ఒక్కరూ మొక్కను నాటి పర్యావరణాన్నీ కాపాడాలి

◆ బీజేపీ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు

**గద్వాల అర్బన్, జూన్ 5,ప్రభాతవార్త:** స్వచ్ఛమైన గాలి ,ఆక్సిజన్ అందాలంటే ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు.మాకే నామ్ పర్ ఏక్ పేడ్,అమ్మ పేరు మీద ఒక మొక్కనాటలనిప్రియతమ నేత మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ,ఆదేశానుసారం పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ సూచన మేరకు పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాకే నామ్ పర్ ఏక్ పేడ్, అమ్మ పేరు మీద ఒక మొక్క గద్వాల పట్టణంలోని డికె. బంగ్లాలో ఈ కార్యక్రమం కన్వీనర్ రవికుమార్ ఎక్బోటే ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని,ఈ మొక్కలు నాటే కార్యక్రమం ఆగస్టు 15 తారీకు వరకు మీ పరిధిలలో మొక్కలు నాటాలని జిల్లా అధ్యక్షుడు అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం జీవన ప్రమాణ రేటు స్వచ్ఛమైన మానవుని యొక్క మనుగడ పెరుగుతుందన్నారు. ప్రతి పౌరుడు కనీసం 3మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు పై ఉన్నదన్నారు. చెట్లు ఉండడం వల్ల వాతావరణం,మంచి గాలి, నీరు వాతావరణం ఆరోగ్యం ఇలా ఎన్నో మంచి ఉపయోగాలు ఉన్నాయన్నారు. చెట్లు ఉండడం వల్ల కార్బన్డయాక్సైడ్ ను చెట్లు పీలుస్తూ మానవులకు కావలసిన మంచి ఆక్సిజన్ ఇచ్చే గుణం స్వభావం ఒక చెట్లకు మాత్రమే ఉన్నదన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అక్కల రమాదేవి ,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దేవాదాస్, బిజెపి సీనియర్ నాయకులు శ్యామ్ రావ్, డిల్లవాల కృష్ణ, దబ్బిలేటి నరసింహ,మోహన్ రెడ్డి ,నరేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## పెబ్బేర్‌లో ఆల్ఫాజోలం పట్టివేత

**పెబ్బేరు, జూన్ 5 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలో వ్యవసాయ మార్కెట్లో గురువారం ఇద్దరు వ్యక్తులు ఆల్ఫాజోలం కల్తికల్లు తయారు చేయడానికి ఉపయోగించే పదార్థం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు వారిపై నిఘా ఉంచి పట్టుకున్నారు. గద్వాల జిల్లాకు చెందిన నరసింహగౌడ్, భాస్కర్ గౌడ్ అనే ఇద్దరు వ్యక్తులను విచారించగా హర్షవర్ధన్ గౌడ్, జగదీష్ గౌడ్, గోపాల్ గౌడ్ అనే ముగ్గురు వ్యక్తుల నుండి ఆల్ఫాజోలం తీసుకువచ్చి కల్లు దుకాణం నడుపుతున్నటువంటి నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన లక్ష్మణ్‌గౌడ్, పండ్ల రమేష్, గజేంద్ర గౌడ్, నాగర్ కర్నూల్‌కు చెందిన యుగంధర్ గౌడ్ సమాచారం మేరకు నరసింహగౌడ్, భాస్కర్ గౌడ్‌ను అదుపులోకి తీసుకొని వారి దగ్గర ఉన్న 500 గ్రాముల ఆల్ఫాజోలం స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసి ప్రస్తుతం పోలీస్ స్టేషన్లో ఉంచామని పెబ్బేరు ఎస్సై యుగంధర్ రెడ్డి తెలియజేశారు. ఈ విచారణలో ఎస్సైతో పాటు, డిటి నందకిషోర్, ఆర్ఐ రాఘవేందర్, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**కృష్ణ, జూన్5 ప్రభాతవార్త:** డా. వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణ మండలం, ముడుమాల గ్రామంలో, కాంగ్రెస్ పార్టీ నాయకుల సమన్వయంతో రైతు వేదికలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో దాదాపు 150 మందికి పైగా చికిత్సలో పాల్గొన్నారని, 80 మందికి పైగా కంటి సమస్యలను గుర్తించి, ఆపరేషన్ నిమిత్తం మహబూబ్‌నగర్లో గల కందూర్ రామ్‌రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి బస్సు ద్వారా పంపించడం జరిగిందని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్ అన్నారు. అర్హులు ప్రతి ఒక్కరు ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి తరపున ధన్యవాదాలు తెలిపారు.

## తల్లితండ్రులను గౌరవించి సేవలు చేసిన వారి జన్మ సార్థకమవుతుంది

◆ శ్రీరాజ్యా విద్యా ఆశ్రమ పీఠాధిపతి వాసుదేవానంద సరస్వతి స్వామి

**నారాయణపేట టౌన్, జూన్ 5 ప్రభాతవార్త:** తల్లి తండ్రిని మించిన దైవం లేదని ప్రతి ఒక్కరు తల్లి తండ్రిని గౌరవించి వారి సేవలు చేసిన వారి జన్మ సార్థకమవుతుందని శ్రీ రాజవిద్యా ఆశ్రమ పిఠాదిపతి వాసు దేవనంద సరస్వతి స్వామి అన్నారు. గురువారం తెలుగు దేశం పార్టీ నాయకులు గోపాల్ యాదవ్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వారిని శాలువతో సత్కరించారు. అనంతరం స్వామి వారు మాట్లాడుతూ రామాయణం మహాభారతం భగవద్గీత హనుమాన్ చాలీసాను నిత్యం పఠనం చేసి ధర్మమార్గంలో నడుచుకోన్నప్పుడే మానవ జన్మకు సార్థకత లభిస్తుందని అన్నారు. స్వామివారిని సన్మానించిన వారిలో టిడిపి మాజీ పార్లమెంట్ ఇంచార్జ్ వినయ్ మిత్ర యాదవ్, యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శశికాంత్ యాదవ్, మొగులప్ప, వీరన్నగౌడ్, గడ్డం రాములు, రమేష్, లాలప్ప, సూర్యకాంత్ పాల్గొన్నారు.

## వేముల గ్రామానికి బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్,జూన్5 ప్రభాతవార్త:** మండలంలోని వేముల గ్రామంలో గురువారం సాయంత్రం నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి వేముల గ్రామము నుండి మహబూబ్‌నగర్‌కు బస్సును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 8 సంవత్సరాల నుంచి బస్సు లేదని వేముల దాసరిపల్లి గ్రామ విద్యార్థి విద్యార్థులకు ఈ రెండు గ్రామ ప్రజలుచాలా ఇబ్బందులు పడ్డారని వేముల గ్రామస్తులు నా దృష్టికి తీసుకు రావడంతో ఆర్టీసీ డిఎంతో మాట్లాడి వేముల, దాసరపల్లి గ్రామానికి బస్సు వెయ్యడం జరిగింది. గత ప్రభుత్వం గ్రామస్తులు మరియు విద్యార్థులు చాలా ఇబ్బందులు పడ్డారని ఎంత వేడుకున్నా గత పాలకులు బస్సువేయ్యలేదని ఇప్పుడు ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు దాసరిపల్లి వేముల గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బస్సును ప్రారంభించమని తెలిపారు. మునపేట మండల అధ్యక్షులు శెట్టిశేఖర్, వేముల గ్రామ అధ్యక్షులు యాట సుధాకర్, మాలా వెంకటయ్య,బాలు నర్సిములు,బుర్రన్న, వేముల గ్రామ ప్రజలు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ద్వారా గోషాలలు ఏర్పాటు చేయాలి

**నారాయణ పేట, జూన్ 5 ప్రభాతవార్త :** ప్రభుత్వం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గోశాలలను ఏర్పాటు చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో గోరక్ష అంశంపై ధర్నా నిర్వహించి మాట్లాడారు. గోవులపై దాడులను అరికట్టాలని గో రక్షకులపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. గోవుల అక్రమ రవాణా ఆపాలని విదేశాలకు ఎగుమతి అవుతున్న గోమాంసాన్ని అరికట్టాలని ధర్నా నిర్వహించారు. జాతీయ ప్రాణిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, పట్టణ కార్యదర్శి, ప్రవీణ్ జిల్లా బజరంగ్‌దళ్ సంయోజక్ వడ్ల శ్రావణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు మురళి, అమ్మపల్లి చిన్నారెడ్డి, ఎలక్ట్రిషన్ సందీప్, మహేష్ చిల్లాల్, చంద్రశేఖర్, హిందూ బంధువులు బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకటంపల్లిలో చోరీ కేసు నమోదు చేసిన పోలీసులు

**ఖిల్లాగణపురం, జూన్ 5, ప్రభాతవార్త;** మండల పరిధిలోని వెంకటం పల్లి గ్రామంలో గురువారం ఓ ఇంట్లోచోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన దేవరశెట్టి ,వెంకటేష్ ఉదయం తనఇంటికి తాళం వేసి వ్యవసాయ పొలానికి వెళ్లి సాయంత్రం నాలుగున్నరగంటలకు తిరిగి రాగాతాళం పగిలి ఉందని ఇంట్లో ఉన్న ఏడున్నర తులాల వెండి 30 వేల రూపాయలు నగదు కనిపించలేదని గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చేరబడి దొంగతనం చేసినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బొడ్రాళ్ల ఉత్సవాలలో పాల్గొన్న జిల్లా ఎస్పీ

**ఆత్మకూర్, జూన్ 5 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా పట్టణంలో గ్రామదేవతల ఆలయాల పునర్నిర్మానంతో పాటుగా గ్రామదేవతల ప్రతిష్ట మరియు పొట్రాల ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని జిల్లా ఎస్పీ రావుల గిరి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు పూజారులు ఎస్పిరావుల గిరిధర్ కు పూర్ణకుంభ హారతితో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు గ్రామాలలో మరియు పట్టణాలలో పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రావుల గిరిధర్ సూచించారు ఎస్పీ వెంబడి ఆత్మకూర్ సిఐ మహేష్ కుమార్ ఎస్సై నరేందర్ పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించాటానికే సదస్సులు

◆ మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ◆ కాటవరంలో కలెక్టర్ పర్యటన



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్5, ప్రభాతవార్త:** భూ సమస్యలను పరిష్కరించటానికే రెవిన్యూ సదస్సులను నిర్వహించటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం అడ్డాకల్ మండలం కాటవరం గ్రామంలో జరుగుతున్న భూ భారతి రెవిన్యూ సదస్సు ను కలెక్టర్ పర్యవేక్షించారు. డెస్క్,దరఖాస్తుల స్వీకరణ పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి లో సమస్యలు తెలుసుకునేందుకు జూన్ 3 నుంచి జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సదస్సుల ద్వారా రైతులు తమ సమస్యను ధరఖాస్తు రూపంలో సమర్పించాలని తదుపరి క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సమస్య పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు.భూభారతి చట్టం ఏప్రిల్ 14న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొనిరాగా ఆ తర్వాత మొదటి దశలో ఏప్రిల్ 17 నుంచి రాష్ట్రములోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా , రెండో దశలో మే 5 నుంచి జిల్లాకి ఒక మండలం పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా జిల్లాలో మూసా పేట మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి దగఖాస్తులని స్వీకరించామని తెలిపారు.అట్టి ధరఖాస్తులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని,రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు కూడా నిర్దేశిత గడువు లోగా పరిష్కారం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం

◆ సీనియర్ సివిల్ జడ్జి సెక్రటరీ వింధ్య నాయక్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సెక్రటరీ వింధ్య నాయక్

**నారాయణ పేట, జూన్ 5 ప్రభాతవార్త:** గురువారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు లీగల్ సర్వీసెస్ సంస్థ వింధ్య నాయక్ గురువారం నారాయణపేట టౌన్ సఖి సెంటర్‌లోవరల్డ్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి సెక్రటరీ వింధ్య నాయక్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు. ప్రతి సంవత్సరం జూన్ 5 రాగానే ప్రపంచం మొత్తం పర్యావరణంగురించి మాట్లాడుకుంటుంది. ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెబుతుంటారు. ఎందుకంటే మెరుగైన జీవితం కోసం ఆరోగ్యంగా ఉండడం తప్పనిసరి అన్నారు. కాలుష్యాన్ని తగ్గించాలంటే ఏం చెయ్యాలి? సోలార్ పవర్ ఉత్పత్తి పెంచుకోవాలి, ఇళ్లలో లెడ్‌లైట్ల వాడకం పెరగాలి,ప్లాస్టిక్ రీసైక్లింగ్ పక్కాగా అమలవ్వాలి, అడవుల్ని పెంచాలి, చెట్లను నరికేవాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి, భారీ చెట్లను తొలగించాల్సి వస్తే వాటిని మరో చోట నాటాలి. వ్యవసాయంలో సంప్రదాయ (సేంద్రియ ఆర్గానిక్) వ్యవసాయ పద్ధతుల్ని జోరుగా అమలుచెయ్యాలి, ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెంచాలి, ఇవన్నీ మనకు తెలిసినవే వీటి అమలే సరిగా జరగట్లేదు. అదే సమస్యవుతోంది. భూమి మన ఇల్లు. దీన్ని పరిశుభ్రంగా,పచ్చగా ఉంచుదాం. తదుపరి సఖి సెంటర్ ఆవరణలో న్యాయమూర్తి ఫారెస్ట్ ఆఫీసర్ ప్రసాద్ చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో నందు నామాజీ సీనియర్ అడ్వకేట్, లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సెల్స్ లక్ష్మిపతిగౌడ్, వి. నాగేశ్వరి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ తిరుపతయ్య, ఫారెస్ట్ ఆఫీసర్ ప్రసాద్ పాల్గొన్నారు. షీటీం మరియు భరోసా సెంటర్ వాళ్ళు మరియు పారా లీగల్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ భవిష్యత్తులో మనము చెట్లను పెంచితేనే వాతావరణం పరిపుష్టంగా ఉండి మన జీవన ఆయు ప్రమాణాలు పెరుగుతాయని కాబట్టి ఈ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ ఒక్కొక్క చెట్టును దత్తత తీసుకొని పెంచి పోషించాలని వాతావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

## చిల్డ్రన్స్ హోమ్‌ను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



చిల్డ్రన్ హోమ్‌ను తనిఖీ చేస్తున్న జడ్జి వింధ్య నాయక్

**నారాయణపేట జూన్ 5 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలోని బోరం బావి దగ్గర ఉన్న చిల్డ్రన్స్ హోమ్‌లను సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ అకస్మాత్తుగా తనిఖీ చేసారు. హాజరు పట్టికను పరిశీలించారు. రోజు ఆహార దిన పట్టికను అడిగి వసతులను తెలుసుకున్నారు. దిన వస్తువులను ఆహారధాన్యాల నాణ్యత మరియు తాగునీరు, పరిశుభ్రత, రిజిస్టరు లను, సీసీటీవీలను పరిశీలించారు. చైల్డ్ మూమెంట్ రిజిస్టట్, చిల్డ్రన్స్‌ని ఆఫీస్ ఆర్డర్స్ ప్రకారం అడ్మిషన్ తీసుకుంటున్నారా, ఆఫీసర్ ఆర్డర్ ప్రకారము తల్లిదండ్రులకి సంబంధించిన వాళ్ళకు అప్పచెపుతున్నారా లేదా రిజిస్టర్ తనిఖీ చేసారు. తల్లిదండ్రు లతో పర్మిషన్‌సంతకాలు తీసుకుంటున్నారా అని తగిన రిజిస్టర్లు చూశారు. వచ్చిన సరుకులు, రైస్ క్వాంటిటీ రిజిస్టర్‌లో వ్రాస్తున్నారా, డైలీ డైరీ, రిజిస్టర్స్ సంబంధిత అధికారి చేత పర్మిషన్ తీసుకోని రిజిస్టర్స్ వ్రాయాలి అన్నారు. స్టాక్ ప్రతి రోజు ఎంట్రీ చెయ్యాలి, స్టాక్ రిజిస్టార్ ప్రకారం ఎంట్రీ ఉన్నాయా చూసారు. చిల్డ్రన్స్‌కీ టాబ్లెట్స్ ఎక్సపైరీ డేట్ చూసారు, బెడ్ చీట్స్, రూమ్స్, బాత్రూమ్, వాష్రూమ్స్ ఎప్పటికప్పుడు క్లీన్‌గా ఉంచాలని ఆదేశించారు. లైట్స్ మరియు ఫాన్స్ వర్కింగ్‌లో ఉన్నాయ చూసారు.బాల్య వివాహం చేస్తున్నారని సమాచారంతో ఉట్కూర్ నుండి రెస్క్యూ చేసి బాలల సంక్షేమ కమిటీ వారు బాలసదనమ్‌లో పునరావాసం కల్పిస్తున్న అమ్మాయితో న్యాయమూర్తి అమ్మాయితో అమ్మాయి తల్లితో 18 సంవత్సరాలు నిండనిదే పెళ్లి చేయరాదని ఒకవేళ చేసినట్ల యితే బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం చట్ట పరమైన చర్యలు తప్పవని, 10సంవత్సరాల జైలుకు పంపిస్తాము అని కౌన్సిలింగ్ ఇచ్చి అమ్మాయిని చదువుపై దృష్టి పెట్టి మంచిగా చదువు పించేలా తల్లి తండ్రులకుచెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఏప్రిల్ 2025 జరిగిన అనువల్ ఎగ్జామ్స్‌లో మొదటి ర్యాంక్ రెండవరాంక్ వచ్చిన చిల్డ్రన్స్‌కీ మెడల్స్‌అందజేశారు. సిబ్బందికి శ్రద్దగాచదువులు స్కూల్స్ పంపించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సెల్ కె.లక్ష్మిపతి గౌడ్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ జీవనశైలిలో మార్పు తప్పనిసరిగా చేసుకోవాలి

ఆహార నియమాలు పాటించాలి : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చంద్రమోహన్



పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఊట్కూరు, జూన్ 5 ప్రభాతవార్త:** ఊట్కూరు మండల పరిధిలోని పగిడిమారి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపులో భాగంగా నారాయణపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె.జయ చంద్రమోహన్ క్యాంపు నిర్వహణ విషయాలను తెలుసుకోవడానికి ఆకస్మిక పర్యటన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అక్కడకు హాజరైన రోగులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జీవనశైలి మారడం వల్ల అనేక రకాలైన రోగాలు దరి చేరడం జరుగుతుందని దీనికంతటికీ కారణము మనము నిత్యజీవితంలో శారీరక శ్రమ చేయకపోవడం ఆహార నియమాలు పాటించకపోవడం అనేక రకాలైన రోగాలకు పిడుతులుగా మారడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ జీవనశైలిలో మార్పు తప్పనిసరిగా చేసుకోవాలని ఆహార నియమాలు పాటించాలని శారీరక శ్రమ చేయాలని సూచించడం జరిగింది. అదేవిధంగా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డా. సత్య ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య ఆహార నియమాలు పాటించడం వల్ల రోగాలు దరిచేరవని ప్రతి ఒక్కరూ శారీరక శ్రమ తప్పనిసరిగా వయసుకు తగ్గట్టు చేయడం వల్ల వైద్యులకు ,మందులకు దూరంగా ఉండవచ్చని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్సిడి జిల్లా కోఆర్డినేటర్ విజయ్ కుమార్, సబ్ యూనిట్ అధికారి అశోక్ కుమార్,టీబీ పర్యవేక్షకులు శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పి నర్సింగమ్మ,నర్సింలు పర్యవేక్షకులు ల్యాబ్ టెక్నిషియన్ నరేష్,ఆరోగ్య కార్యకర్త సుజాత ఆశా కార్యకర్తలు పరమేశ్వరి,ఆకాశవాణి, మల్కమ్మ,శంకరమ్మ, మణెమ్మ పాల్గొనడం జరిగింది. ఈ క్యాంపులో మొత్తం 83 మందికి ఓపి పరీక్షలు నిర్వహించగ అందరికీ రక్త పరీక్షలు కూడా నిర్వహించడం జరిగింది.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, జూన్ 5 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నారాయణపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని స్వచ్ఛ ర్యాలీని జిల్లా అటవీ శాఖ అధికారి పచ్చ జెండా ఊపిరి ప్రారంభించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుండి అశోక్‌నగర్ వరకు కొనసాగింది. అనంతరం మునిసిపల్ ఉద్యోగులు, అటవీ శాఖ ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు కలిసి అమృత 2వీ ఉమెన్స్ ఫర్ ట్రీస్ ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం జరిగింది. పర్యావరణ పరిరక్షణపై అద్భుత ప్రదర్శన కనబరిచిన నారాయణపేట మున్సిపాలిటీకి తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తరఫున ఉత్తమ ప్రదర్శన అవార్డు అందించింది. నారాయణపేట పట్టణంలో సేకరించిన చెత్తను 100 పునర్వినియోగంలోకి తీసుకువచ్చి అది చెత్త నుండి కంపోస్ట్ ఎరువును పొడి చెత్త నుండి పరిశ్రమలలో మండుటకు వినియోగించే బ్రికెట్స్ తయారీ, ప్లాస్టిక్ నుంచి మండే స్వభావం గల ఆయిల్ తయారు లాంటి పునర్వినియోగం వస్తువులను తయారు చేస్తూ కాలుష్య నివారణకై పాటుపడుతున్నందుకు ఈ అవార్డు లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖచే మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర అవార్డును అందుకున్నారు.

## విద్యాశాఖ డైరెక్టర్ పిలుపుతో అమ్మ పేరుతో ఒక మొక్క

**ఉట్కూర్,జూన్ 5 ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పచ్చదనం అవగాహన ప్రచారంలో భాగంగా తెలంగాణ విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఇచ్చిన ఏక్ పేడ్ మా కే నామ్ ( అమ్మ పేరుతో ఒక మొక్క) పిలుపుకు స్పందిస్తూ ఉపాధ్యాయురాలు కృష్ణవేణి కుమారులు రాణా ప్రతాప్, నరేంద్రలు తల్లితో కలిసి మొక్కను నాటి ఆదర్శంగా నిలిచారు. మొక్కలు నాటితేనే పర్యావరణం కలుషితం కాకుండా కాపాడగలమని ప్రభాతవార్తతో అన్నారు.

## నేడు జిల్లాకు ఉప ముఖ్యమంత్రి

(మొదటి పేజీ తరువాయి)

**డిప్యూటీ సీఎం షెడ్యూల్:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రజా భవన్ బేగం పేట,హైదరాబాద్ నుండి బయలు దేరి మూసాపేట మండలానికి ఉదయం 11 గంటలకు చేరుకుంటారు. అక్కడే అధికారులు, అనధికారులను కలుసు కుంటారు.

- ఉదయం 11.10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 132/33 కె. వి విద్యుత్ సబ్ స్టేషన్,మండలం లో వివిధ గ్రామాల్లో ఏర్పాటు కానున్న (12) 33/11 కె.వి సబ్ స్టేషన్ లకు మండల కేంద్రం లో శంకుస్థాపన చేస్తారు.
- మధ్యాహ్నం12 నుంచి1 గంట వరకు పబ్లిక్ మీటింగ్ లో పాల్గొంటారు.
- 2 గంటలకు మూసా పేట నుండి బయలు దేరి మధ్యాహ్నం 3 గంటలకు నవాబ్ పేట మండలం కు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం4.15 గంటల వరకు 132/33కె.విసబ్ స్టేషన్,మండలంలోవివిధ గ్రామాల్లో ఏర్పాటు కాన్ను(16) 33/11 కె.వి సబ్ స్టేషన్‌లకు మండల కేంద్రంలో శంఖు స్థాపన చేస్తారు.
- సాయంత్రం 4.15 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని అనంతరం హైదరాబాద్ బయలు దేరుతారు.

పబ్లిక్ మీటింగ్ లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు,కుట్టు మిషన్ లు పంపిణీ,విత్తన కిట్ పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మూసాపేట మండలంలో ఉప ముఖ్య మంత్రి పర్యటన కు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సబ్ స్టేషన్‌ల శంకుస్థాపన కు ఏర్పాట్లు పరిశీలించారు.పబ్లిక్ మీటింగ్ వేదిక,ప్రజలకు తాగు నీరు, వైద్య శాఖ ద్వారా హెల్త్ క్యాంప్,అగ్ని మాపక శాఖ ద్వారా అగ్ని మాపక వాహనం,పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎస్.పి.డి.సి.ఎల్ ఎస్. ఈ.రమేష్,తహశీల్దార్ రాజు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. కాలుష్యాన్ని అంతం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

పర్యావరణదినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వకృత్వం ,డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన వారికి మెమెంటో లు కలెక్టర్ అందచేశారు.పర్యావరణ కాలుష్య మండలి ద్వారా జూట్ తో తయారు చేసిన బ్యాగ్ లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్చర్ల కు బి.ఆర్.ఆర్.డిగ్రీ కళాశాల అధ్యాపకులు సదాశివయ్య స్నేక్‌షోను విద్యార్థులు తిలకించారు. తొలుత స్టేడియం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్లాస్టిక్ ను నిర్మూలిద్దాం అనే అంశంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డి.ఎఫ్.ఓ సత్య నారా యణ, జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ డి.పి.ఆర్.ఓ శ్రీనివాస్, ఎల్. డి. ఎం కల్వ భాస్కర్, పరిశ్రమల శాఖ జిఎం ప్రతాప్ పాల్గొన్నారు.

## రహదారి భద్రతా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని ఆదేశించారు .స్టేట్ హైవేవేదిర క్రాస్ రోడ్,పాలకొండ బైపాస్‌ఎక్స్ రోడ్,పిస్తా హౌజ్ క్రాస్ రోడ్ ఈ సంవత్సరపు నిర్వహణ నిధుల నుండి దొడ్డ భద్రత కు సంబంధించి రంబుల్ స్ట్రిప్ లు,సైన్ బోర్డ్‌లు ఆగస్టు మాసం చివరి లోగా, ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్.హెచ్ 167 బండ మీది పల్లి,ధర్నా పూర్,ఓబులాయ పల్లి,మన్యం కొండ వద్ద రహదారి భద్రతా రంబుల్ స్ట్రిప్ లు,సైన్ బోర్డ్ లు ఒక వారంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్.హెచ్ 44 బాలానగర్ ఎక్స్ రోడ్డు, రాజాపూర్ వద్ద రంబుల్ స్ట్రిప్ లు,సైన్ బోర్డ్ లు,ముదిరెడ్డి పల్లి వద్ద సర్వీస్ రోడ్డు పనులు,లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారుపోలేపల్లి సెజ్ వద్ద రంబుల్ స్ట్రిప్,స్పీడ్ బ్రేకర్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. రహదారుల పై జరిగే ప్రమాదాల కు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ అట్టి కేసులను పోలీస్ శాఖ కు సమాచారం అందించాలన్నారు. జిల్లాలో 447 స్కూల్ బస్ లకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ లేని వాటిని అనుమతించవద్దని రవాణా, పోలీస్‌శాఖ అధికారులను ఆదేశించారు.పాఠశాలల విద్యార్థినీ,విద్యార్థుల్లో ట్రాఫిక్ నిబంధనలపైట్రాఫిక్ అవగాహన పార్క్ లు ఏర్పాటు చేసి పాఠశాలల విద్యార్థులకు అవగాహన కలిగించాలని అన్నారు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్,,అర్‌టి ఈ ఈ దేశ్యా నాయక్,ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ కిషన్ పాల్గొన్నారు.

## జిల్లాలో 2328 మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు

**వనపర్తి, జూన్ 5 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో వరి కొనుగోలుపై జిల్లా కలెక్టర్ ద్వారా జారీ చేసిన ప్రత్యేక బులెటిన్ యాసంగిలో ఇప్పటి వరకు 2,57,447మెట్రిక్ టన్నుల వరికొనుగోలు చేయడం జరిగింది. గురువారం రోజు 2328 మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేసి ఆయా మిల్లులు, గోదాములకు తరలించడం జరిగింది. వడ్లు తరలించడానికి ఈ రోజు 80 లారీల్లో ధాన్యం తరలించగా ఇప్పటి వరకు 80 లారీల వడ్లు మిల్లులో దించుకోవడంజరిగింది. ఇప్పటి వరకు రూ. 513 కోట్లు రైతుల ఖాతాలో జమ చేయడం జరిగింది. ఇప్పటి వరకు 95 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యిందని మిగిలిన 5 శాతం వడ్లు త్వరగా కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం ద్వారా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతున్నట్లు కలెక్టర్ వివరించారు.

## దేవరకద్ర నియోజకవర్గానికి విచ్చేస్తున్న ఉపముఖ్యమంత్రి

**దేవరకద్ర, జూన్ 5 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 సమీపంలో 13 కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లు, 132/33 కెవి సబ్‌స్టేషన్‌కు 10 గం.లకు నిర్వహిస్తున్న భూమి పూజ మూసాపేట మండల కేంద్రంలోని కార్యక్రమంలో పాల్గొని అనంతరం మైనార్టీ ఫైనాన్స్ ద్వారా మంజూరైన కుట్టు మిషన్‌లను లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమంలో తదనంతరం రైతులకు ట్రాన్స్ఫార్మర్లు పంపిణీ చేస్తారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రిమల్లు భట్టి విక్రమార్క, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్ పాల్గొంటారు. కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గ ప్రజలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, సేవాదళ్, యూత్ కాంగ్రెస్,ఎన్ఎస్‌యుఐ మహిళ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయగలరని తెలిపారు.

## ఘనంగా శ్రీవీర నాగమ్మ దేవత ఉత్సవాలు

**వెల్దండ, జూన్ 5 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీవీరనాగమ్మ దేవత ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా వీర నాగమ్మ దేవత ఆలయాన్ని మామిడి తోరణాలు విద్యుత్ దీపాలంకరణతో ఎంతో శోభాయమానంగా అలంకరించారు. సాయంత్రం పుట్ట పూజ కార్యక్రమం, దడువులయ్య పూజ నిర్వహించారు. బైండ్లవారు శ్రీ వీరనాగమ్మ దేవత కథతో అలరించారు. శుక్రవారం శ్రీ వీర నాగమ్మ దేవత కళ్యాణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.అమ్మవారి కథ, కళ్యాణం ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రైతన్నల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**వెల్దండ, జూన్ 5 ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టించి పంటలను పండిస్తున్న రైతన్నల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్‌అన్నారు. మండల కేంద్రంలో రైతు వేదికలో గురువారం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్,మాజీ సర్పంచ్ యెన్నంభూపతిరెడ్డిలు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, కిష్టాల్, భరత్‌గౌడ్, శ్రీను ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

**కల్వకుర్తి, జూన్ 05 ప్రభాతవార్త:** కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో కాయకల్ప ఎక్స్టర్నల్ అసిస్‌మెంట్‌లో భాగంగా నాణ్యత బృందం గురువారం డాక్టర్ శ్రీదేవి, రాజన్, మౌనిక, ప్రియదర్శినిలు ఆసుపత్రిని సందర్శించారు. గతంలో కాయకల్ప ఇంటర్నల్ అసిస్‌మెంట్‌లో 80 శాతం మార్కులు రావడంతో ఎక్స్టర్నల్ సెంట్రల్ బృందం ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ శివరాం సమక్షంలో అన్ని విభాగాల వారీగా తనిఖీ చేసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రభు, యశోద, విష్ణు, శివ, షకీల్, వసంతా దేవి, సుష్మ, ఉదయ్, స్వప్న,శిరీష నర్సింగ్ సూపరిటెండెంట్‌శిరోమణి సీనియర్‌నర్సింగ్ ఆఫీసర్స్ జాయ్ మెర్సీ,బాలామణి ,సునీత, ఫార్మసీ విభాగం సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.